కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి



ప్రతి ఖరీఫ్ సీజన్‌కు ముందు వ్యవసాయ శాఖ ఎంత యూరియా అవసరమో అంచనా వేసుకుంటుంది. అందుకు అనుగుణంగా ప్రణాళిక తయారుచేసుకొని అమలు చేస్తుంది. వరినాట్లు వేసే సరికి ఎరువులు, విత్తనాల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యం కారణంగా ఇవేవీ జరగలేదు. ముఖ్యమంత్రికి ముందుచూపు ఉండాలి. మా గత ప్రభుత్వంలో ఐదేళ్లు ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి సాయం సకాలంలో అందించాం. మా హయాంలో తీసుకున్న చర్యల వల్ల గత ఏడాది ఇబ్బంది రాలేదు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎరువులు వాడితే పంట దిగుబడి రాదంటున్నారు. ఇక సీఎం చంద్రబాబు అయితే ఎరువులు ఇవ్వండని అడిగిన రైతులను జైల్లో వేసి, కేసులు నమోదు చేయాలంటూ భయపెడుతున్నారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వ వైఖరి మారకుంటే వైఎస్సార్‌సీపీ మరింత ఉధృతంగా పోరాటం చేస్తుంది.

–గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రైతన్న కన్నెర్ర



అనకాపల్లిలో ఆర్డీవో కార్యాలయానికి భారీ సంఖ్యలో ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు

పోలీసుల ఆంక్షల మధ్య హోరెత్తిన 'అన్నదాత పోరు'

- యూరియా కొరతపై కదం తొక్కిన వ్యవసాయదారులు
- ఎన్ని ఆటంకాలు కల్పించినా వైఎస్సార్‌సీపీ ఆందోళన సూపర్ సక్సెస్
- అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున నిరసన
- అవసరమైనంత ఎరువులు అందించాలని అధికారులకు వినతి



అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి ఎడ్ల బండిపై వస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

యూరియా కొరతపై అన్నదాత కన్నెర్ర జేశాడు. వ్యవసాయం దండగ అన్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన చెందాడు. తమ సమస్యలను పట్టించుకోనందుకు ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందుకే పోలీసుల ఆంక్షలను సైతం లెక్కచేయకుండా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'అన్నదాత పోరు'లో రైతులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఎన్ని ఆటంకాలు పెట్టినా అదరలేదు.. బెదరలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో వేకువజాము నుంచే వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ముఖ్యమైన జిల్లా స్థాయి నాయకులను గృహ నిర్బంధం చేసి 'అన్నదాత పోరు'ను అడ్డుకునేందుకు కూటమి సర్కార్ కుటిల ప్రయత్నాలు చేసింది. ఎన్ని ఆంక్షలు పెట్టినా అనకాపల్లి, నర్సీపట్నంలలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. వందలాదిమంది నినాదాలతో హోరెత్తించారు.

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అనకాపల్లి, నర్సీపట్నంలలో తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమం సందర్భంగా ఎమర్జెన్సీ వాతావరణం కనిపించింది. అనకాపల్లి రింగురోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం చుట్టూ పోలీసులు మోహరించారు. అన్నదాత పోరు ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. 10 నుంచి 20 మంది వరకే అనుమతిస్తామని, అంతకు మించితే అరెస్ట్ చేస్తామంటూ డీఎస్పీ శ్రావణి, అనకాపల్లి టౌన్ సీఐ విజయ్‌కుమార్ రైతులను, పార్టీ కార్యకర్తలను భయపెట్టే ప్రయత్నం చేశారు. ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి లేదంటూ మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌కు డీఎస్పీ నోటీసు కూడా ఇచ్చారు. అయినా ఎక్కడా రైతులు భయపడలేదు. మమ్మల్ని అరెస్ట్ చేసుకున్నా.. మాపై కేసులు పెట్టుకున్నా ర్యాలీ చేసి తీరుతాం.. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామంటూ పాదయాత్రగా బయలుదేరారు. పోలీసులు చుట్టుముట్టినా ఎక్కడా బెదరలేదు.. జంకలేదు.. రైతులకు కొరత లేకుండా యూరియా ఇవ్వాలంటూ నినాదాలు చేసుకుంటూ పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ రెండు కిలోమీటర్ల మేర పాదయాత్రగా వెళ్లారు. అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి, పాయకరావు పేట, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, మలసాల భరత్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్



ప్లకార్డులతో రైతుల నిరసన

కూటమి పాలన... రైతులకు శాపం



కూటమి ప్రభుత్వం 15 నెలల పాలన రైతులకు శాపంగా మారింది. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో, పవన్ కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో కూడా యూరియా కొరత తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో సాధారణ సాగులో 70 శాతమే పంట వేశారు. దానికే ఎరువులు ఇవ్వలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు రాజుగా ఉండేవాడు. విత్తనాలు, ఎరువులు ఇంటికే డోర్ డెలివరీ చేశావాళ్లం. కూటమి నాయకులు యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొంది.

–ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

రాజ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, పార్టీ ఉత్తరాంధ్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ, రాష్ట్ర కార్యదర్శులు బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల కుమార్‌రాజా, పైలా శ్రీనివాసరావు, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జాజుల రమేష్, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, పరవాడ జెడ్పీటీసీ పీఎస్ రాజు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు హేమంత్‌కుమార్, నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు వడ్డాది అప్పలరాజు, సీనియర్ నాయకులు శరగడం చినఅప్పలనాయుడు, గండి రవికుమార్, బోకం రామునాయుడు, కె.ఎం నాయుడు, కోరకుండ రాఘవ, వేగి త్రినాథ్, తగరంపూడి నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎంపీలు సత్యవతి, మాధవి, సమన్వయకర్తలు ధర్మశ్రీ, కంబాల జోగులు, అదీప్‌రాజు, మలసాల, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, రాష్ట్ర కార్యదర్శులు బొడ్డేడ, దిలీప్‌కుమార్

అన్నదాతల నినాదాలతో ప్రతిధ్వనించిన నర్సీపట్నం



నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, చింతకాయల సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: రైతులకు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఆందోళనను భగ్నం చేసేందుకు ప్రభుత్వం ఎక్కడికక్కడ పార్టీ నాయకులను హౌస్ అరెస్టులు చేయించింది. ఇద్దరు డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, స్పెషల్‌పార్టీ పోలీసులు మోహరించారు. అయినప్పటికీ పార్టీ శ్రేణులు వివిధ మార్గాల్లో ఆందోళన కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా మున్సిపల్ స్టేడియంలో గాంధీ విగ్రహం, అబీద్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పుడు అడ్డుకోవడం భావ్యం కాదని గణేష్ పోలీసులకు సూచించారు. దీంతో పోలీసులు వెనక్కు తగ్గారు. ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో లేకపోవడంతో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

అయ్యన్నపాత్రుడికి తెలిసిందల్లా దోపిడీలు, దౌర్జన్యాలే..

ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడుతుండడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు, బాధ్యత గుర్తు చేసేందుకు తాము శాంతియుతంగా నిరసన చేపడితే భగ్నం చేసేందుకు ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసిందన్నారు. వ్యవసాయం గురించి తెలియని వారు కూడా మాట్లాడుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అసలు వ్యవసాయం గురించి అయ్యన్నపాత్రుడికి ఏమి తెలుసునని గణేష్ మండిపడ్డారు. ఆయనకు తెలిసిందల్లా దోపిడీలు, దౌర్జన్యాలేనన్నారు. లేటరైట్ ద్వారా స్పీకర్ రోజుకు రూ.3 కోట్లు వెనకేసుకుంటున్నారన్నారు. రోలుగుంట క్వారీల ద్వారా నెలకు రూ.50 లక్షలు, జి.కోడూరు క్వారీ ద్వారా కోట్లు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చిన విషయం తెలియలేదంటే.. జగనన్న పెట్టిన రైతు భరోసా కేంద్రాలు అయ్యన్నపాత్రుడి గుండెల్లో ఎంతగా నాటుకుపోయాయో అర్థమవుతోందన్నారు. రైతులు సంతోషంగా ఉన్నారని స్పీకర్ అనుకుంటే సరిపోదని, గ్రామాల్లోకి వెళితే ఎరువుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయన్నారు. ఒక్క నర్సీపట్నం నియోజకవర్గంలో 4015 టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 1500 టన్నులు సరఫరా చేశామని అధికారులే చెబుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, యూత్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.వరుణ్, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నర్సీపట్నం మండల అధ్యక్షుడు శానపతి వెంకటరత్నం, గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, బేతిరెడ్డి రత్నం, వీరమాచినేని జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ నాయకులు పెట్ల భద్రాచలం, వివిధ విభాగాలకు చెందిన పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పార్టీ నాయకులతో కలిసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ఐదెకరాలున్నా ఒక బస్తాయేనా?



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎన్ని టన్నుల యూరియా అవసరమో ప్రభుత్వానికి తెలియదా? రైతుకు అర ఎకరం ఉన్నా.. ఐదెకరాలున్నా ఒక యూరియా బస్తాయే ఇస్తున్నారు. అదెలా సరిపోతుంది. అధికారులు యూరియా కొరత లేదు, అడిగినంతా ఇస్తున్నామంటున్నారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూడాలని వారిని వేడుకుంటున్నాం. కూటమి ప్రభుత్వంలో రైతులు వ్యవసాయం చేయాలంటేనే భయపడుతున్నారు. పెట్టిన పెట్టుబడి అయినా వస్తుందా.. గతేడాది లాగే అప్పుల ఊబిలో కూరుకుపోతామేమోనని ఆవేదన చెందుతున్నారు.

–బూడి ముత్యాలనాయుడు, మాజీ డిప్యూటీ సీఎం

రైతుల గొంతునొక్కే ప్రయత్నం



రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతులు యూరియా కావాలంటూ కదం తొక్కారు. నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసుల ద్వారా రైతుల గొంతు నొక్కే ప్రయత్నాలు చేశారు. ఎరువుల కొరత నివారించాలి. క్రాప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలి. యూరియా కొరత ఉన్నా.. అధికారులు మాత్రం లేదంటున్నారు. ప్రైవేట్ దుకాణాల్లో టీడీపీ నేతలు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. రాష్ట్రంలో రైతులు ఈ ఏడాది కూడా దిగుబడి రాదేమోనని భయపడుతున్నారు. ప్రభుత్వం మొండి వైఖరిని మానుకోవాలి. రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలి.

–కరణం ధర్మశ్రీ, మాజీ ప్రభుత్వ విప్

ఎక్కడికక్కడ అరెస్టులు.. ఆటంకాలు

వేకువజాము నుంచే వైఎస్సార్‌సీపీ నేతల గృహ నిర్బంధం





నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణల హౌస్ అరెస్ట్

సాక్షి, అనకాపల్లి: ఎమర్జెన్సీని తలపించేలా 'అన్నదాత పోరు'ను అడ్డుకునేందుకు కూటమి సర్కారు కుటిల ప్రయత్నాలు చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు మంగళవారం వేకువజాము నుంచే వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని గృహ నిర్బంధం చేశారు. ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా వారిని కట్టడి చేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో గృహ నిర్బంధం చేసిన వారిలో.. నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, అడ్డురోడ్డులో పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, చినదొడ్డిగల్లులో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, కోటవురట్ల మండలం తంగేడులో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ దత్తుడు సీతబాబు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, పాముల వాకలో మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పాయకరావుపేట మండలం పెంటకోటలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, నామవరంలో ఎంపీపీ ఈసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు ఉన్నారు. అడ్డురోడ్డులో నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులును ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని, ప్రస్తుతం సమన్వయకర్తగా ఉన్నానని, జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి వెళ్లక తప్పదని, పంపించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించడంతో జోగులును మాత్రం విడిచిపెట్టారు.

చోడవరం నియోజకవర్గం: పార్టీ బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, రోలుగుంట జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, లక్ష్మీ శ్రీనివాస్ దంపతులు, రావికమతం మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైలా రాజు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తలారి ఆదిమూర్తిలను హౌస్ అరెస్ట్ చేశారు.

నర్సీపట్నం నియోజకవర్గం: నర్సీపట్నంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, నర్సీపట్నం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మాకవరపాలెంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, నాతవరం జెడ్పీటీసీ అప్పలనర్స, మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్‌లను హౌస్ అరెస్ట్ చేశారు.

మాడుగుల నియోజకవర్గం: కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, జేసీఎస్ కన్వీనర్, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, వైస్ ఎంపీపీ పాలిమేర విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడులను గృహ నిర్బంధం చేశారు.

యలమంచిలి నియోజకవర్గం: ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, ఆమె భర్త సేనాపతి రాము, అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్య లచ్చన్నాయుడు, మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జెడ్పీటీసీ లాలం రాములను హౌస్ అరెస్ట్ చేశారు.

అనకాపల్లి నియోజకవర్గం: అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబులను గృహ నిర్బంధం చేశారు.



నక్కపల్లి: గృహ నిర్బంధంతో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆందోళన



కోటవురట్ల: తంగేడులో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజును హౌస్ అరెస్టు



మాకవరపాలెం: హౌస్ అరెస్ట్‌లో ఉన్న రుత్తల యర్రాపాత్రుడు



గొలుగొండ : నిర్బంధంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత

కేజీహెచ్‌లో కీచకులు

- వైద్యురాలిపై వార్డు బాయ్, రోగి తల్లిపై వైద్యుడి వేధింపులు
- ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని ఉన్నతాధికారులు
- మహిళా కమిషన్ దృష్టికెళ్లినా ఫలితం శూన్యం
- కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత ప్రశ్నార్థకం?



మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో కీచకుల వ్యవహారం కలకలం రేపుతోంది. రోగులు, వారి బంధువులనే కాకుండా, మహిళా వైద్యులను సైతం కొందరు వేధింపులకు గురిచేస్తున్నారు. వార్డు బాయ్‌ల నుంచి వైద్యుల వరకు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. విధి నిర్వహణలో ఉన్న ఒక వైద్యురాలి పట్ల వార్డు బాయ్, చికిత్స కోసం వచ్చిన రోగి తల్లి పట్ల ఓ వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించడం దుమారం రేపుతోంది. ఈ ఘటనలపై బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొద్ది రోజుల వ్యవధిలోనే ఈ రెండు ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. విశేషమేమిటంటే.. ఇటు కేజీహెచ్‌కు, అటు ఆంధ్రా మెడికల్ కాలేజీకి మహిళలే సారథ్యం వహిస్తున్న తరుణంలో.. ఇలాంటి ఘటనలు జరగడం, వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ఈ ఘటనలు కేజీహెచ్ ప్రతిష్టను మసకబారుస్తున్నాయి.

రోగి తల్లికి వైద్యుడి వేధింపులు

పరవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళ.. అనారోగ్యంతో ఉన్న తన కుమార్తెను తీసుకుని కేజీహెచ్‌కు వచ్చారు. సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న కుమార్తె వద్ద సహాయంగా ఉంటున్న ఆ తల్లి పట్ల ఓ వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అతను రోగితో కాకుండా ఆమె తల్లితో అనుచితంగా మాట్లాడటంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందికి గురైంది. ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగదనే అనుమానంతో.. బాధితురాలు నేరుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వివరణ ఇవ్వాలని కోరుతూ మహిళా కమిషన్.. కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు గత నెల 20న ఒకసారి, ఈ నెల 4న మరోసారి లేఖలు పంపింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాధానం రాలేదని కమిషన్ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యురాలిపై వార్డు బాయ్ అసభ్య ప్రవర్తన

అనస్థీషియా విభాగానికి చెందిన ఒక వైద్యురాలు.. వారానికి రెండు రోజులు (మంగళ, శుక్రవారాలు) అధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. అందులో భాగంగా గత నెల 26న ఉదయం 11 గంటల సమయంలో ఆమె రోగులను చూస్తుండగా.. శంకరరావు అనే వార్డు బాయ్ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఒకసారి కాదు, రెండుసార్లు.. అందరి ముందు అలా ప్రవర్తించడంతో ఆ వైద్యురాలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. ఈ విషయాన్ని ఆమె అక్కడే ఉన్న డ్యూటీ డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, తమ విభాగాధిపతులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదే రోజు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐకి కూడా ఫిర్యాదు చేశారు.

బల్క్‌డ్రగ్ పార్క్ ఉద్యమానికి సహకరించండి

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన మత్స్యకారులు

8లో

ఓజోన్ పరిరక్షణ బ్రోచర్ ఆవిష్కరణ

నర్సీపట్నం: ఈ నెల 16న జరగనున్న ఇంటర్నేషనల్ ఓజోన్ డే పరిరక్షణపై గ్రీన్‌క్లబ్ చేపట్టే అవగాహన ర్యాలీకి సంబంధించిన బ్రోచర్‌ను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ఆవిష్కరించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయాలని, ఓజోన్ పరిరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు డి.గోపీనాథ్, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

క్లుప్తంగా

విశ్రాంత హోంగార్డుకు రూ.4.04 లక్షల చెక్కు



పదవీ విరమణ పొందిన హోంగార్డు కోమలకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: హోంగార్డుల విధులు పోలీస్‌శాఖలో అంతర్భాగమేనని, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో హోంగార్డుగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన సీంద్రి కోమలకు రూ.4,04,890ల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రిటైరైన లేదా మరణించిన హోంగార్డులకు రెండు జిల్లాల హోంగార్డులు ఒకరోజు వేతనం స్వచ్ఛందంగా అందజేస్తున్నారని చెప్పారు. సీంద్రి కోమల విధులను నిబద్ధతతో, విశ్వాసపాత్రంగా నిర్వర్తించారని, ఆమె సేవలు ప్రశంసనీయమన్నారు. ఎస్పీ కార్యాలయం పరిపాలన అధికారి సీహెచ్.తిలక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

నర్సీపట్నం: ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన నర్సీపట్నం శివపురం మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు డి.గోపీనాథ్, రోలుగుంట హైస్కూల్ ఉపాధ్యాయిని నాగజ్యోతిని అనకాపల్లి కార్యాలయంలో డీఈవో అప్పారావునాయుడు అభినందించారు. ఇదే స్ఫూర్తితో గుణాత్మకమైన విద్యను విద్యార్థులకు అందించడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని డీఈవో సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాల సేకరణ కేంద్రం మేడపై మృతదేహం

ఎస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో విశాఖ డెయిరీ పాల సేకరణ భవనం మేడపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైందని ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రెండు, మూడు రోజులు క్రితం మృతి చెంది ఉంటాడని, ముఖం గుర్తుపట్టలేనట్టుగా మారిపోయిందన్నారు. మృతుడి శరీరంపై తెల్లచొక్కా, బ్లూ కలర్ ప్యాంట్ ఉందన్నారు. వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్రిటికల్ సమస్యా.. డోంట్ కేర్

చివరి దశలో 50 పడకల ఆస్పత్రి పనులు

- వైఎస్సార్‌సీపీ పాలనలో పనులు ప్రారంభం
- అనకాపల్లిలో రూ.22.5 కోట్లతో భవన నిర్మాణం
- త్వరలో అందుబాటులోకి..

గ్రౌండ్ ఫ్లోర్: డిలేసిస్ (4 పడకలు), డాక్టర్ రూమ్, దోనింగ్, డీయూ ఎంసీహెచ్(2 పడకలు), ఎల్‌డీఆర్ (ఒక్కొక్కరికి 1 బెడ్), దోనింగ్ ఫిమేల్, ఆర్‌వో డయాలైజర్, అల్ట్రా సౌండ్, ప్లాస్టర్ రూమ్, పీఓసీ ల్యాబ్, ఎలక్ట్రికల్ రూమ్, డ్యూటీ డాక్టర్/ఎగ్జామినేషన్ రూమ్, ఎమర్జెన్సీ వార్డు (6 పడకలు), మైనర్ ప్రొసీజర్, నర్సుల రూమ్, ఇంజెక్షన్ డ్రెస్సింగ్ రూమ్, మరుగుదొడ్లు ఉంటాయి.

మొదటి అంతస్తు: ఐఎస్‌వో రూమ్ (2 పడకలు), డైనింగ్ మెల్ -2 నంబర్లు, డీయూ, ఏఎస్‌వో వార్డు (6 పడకలు), క్లినికల్ టెస్ట్, ఐఎస్‌వో వార్డు (15 పడకలు), కౌన్సెలింగ్ రూమ్‌లు-2 నోస్, డౌఫింగ్, ఐసీయూ-ఐఎస్‌వో స్టోర్, డీఆర్ డ్యూటీ, స్టాఫ్ రూమ్, ఐఎస్‌వో వార్డు -2 నంబర్లు (ఒక్కొక్కటి 2 బెడ్లు), మరుగుదొడ్లు ఉంటాయి.

రెండో అంతస్తు: హెచ్‌డీయూ(6 బెడ్లు), డీయూ, అనస్థీషియా రూమ్, అటెండెంట్ వెయిటింగ్, ఐసీయూ (10 బెడ్లు), ఓటీలు- 2 నంబర్లు, స్టెరిలైజేషన్, ఎలక్ట్రికల్ రూమ్, ఈక్యూఎంటీ రూమ్, ఫ్రీ అండ్ పోస్ట్ ఓపీ- 5 బెడ్లు డీఆర్ డ్యూటీ, స్టాఫ్ నర్సులు ప్రత్యేక సౌకర్యాలు ఉంటాయి.



జిల్లా ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదురుగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్



అనకాపల్లి: పట్టణంలో క్రిటికల్ కేర్ బ్లాక్ త్వరలో అందుబాటులోకి రానుంది. జిల్లాలో అత్యధిక రసాయన పరిశ్రమలు ఉండటంతో ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలందక మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి కానున్నాయి. మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చి 24 గంటలూ వైద్య సేవలందించనున్నారు.

జిల్లాలో అచ్యుతాపురం, పరవాడ, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో ఎక్కువగా రసాయన పరిశ్రమలు ఉన్నాయి. వీటితోపాటు ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో సంభవించే అగ్ని ప్రమాదాల్లో పలువురు మృతి చెందుతున్నారు. గాయపడిన మరికొందరిని విశాఖ సిటీలో కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించే క్రమంలో కొంతమంది మార్గమధ్యంలో మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో క్రిటికల్ కేర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టయితే గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందించినట్టయితే ప్రాణాలు కాపాడవచ్చు. ఈ విషయమై 2023 డిసెంబర్‌లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎంపీ బీవీ సత్యవతి, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా అధికారులు అప్పటి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కోరగా, క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి రూ.22.5 కోట్లు విడుదల చేశారు. 2024 ఫిబ్రవరిలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదురుగా ప్రభుత్వ స్థలంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ప్రారంభమైన పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



క్రిటికల్ కేర్ బ్లాక్ భవనంలో టైల్స్ వేస్తున్న దృశ్యం

క్రిటికల్ కేర్ బ్లాక్‌లో 24 గంటలూ వైద్యం...

క్రిటికల్ కేర్ ఆస్పత్రిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదురుగా నిర్మిస్తున్నారు. ఇక్కడ మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్(ఆస్పత్రి)ను ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి అనుసంధానం చేస్తారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌లో, డయాలసిస్ రోగులకు ప్రత్యేకంగా కొన్ని బెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. గుండెపోటు, శ్వాసకోశ వైఫల్యం, తీవ్రమైన గాయాలైన వారికి ఇక్కడ వైద్య సేవలు అందిస్తారు. 24 గంటలూ నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు.

ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణ

క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు ఈ నెల 30వ తేదీలోపు పూర్తవుతాయి. ఈ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేసిన వెంటనే రాష్ట్ర వైద్య ఆరోగ్యం శాఖ 50 పడకలకు కావలసిన వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించినట్లయితే కేంద్ర ప్రభుత్వం రోగులకు ఉపయోగించే అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేస్తుంది. ఏడాది పాటు వైద్యులకు, వైద్య సిబ్బందికి జీతాలు చెల్లిస్తుంది. రెండో ఏడాది నుంచి పూర్తి పర్యవేక్షణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి వస్తుంది.

ప్రత్యేక పార్కింగ్ స్థలం...

క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ఎదురుగా వాహనాలు నిలుపుదల చేసేందుకు ఎక్కువగా పార్కింగ్ స్థలం ఉంది. రోగితోపాటు రోగి బంధువు ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.


ఈ నెలాఖరుకు పూర్తవుతాయి



రెండు మాసాల్లో క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుంది. భవన నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయి. ఈ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తాం. వెంటనే ఏడాదిపాటు కేంద్ర ఆరోగ్యశాఖ పర్యవేక్షణ తర్వాత రాష్ట్ర ఆరోగ్యశాఖకు అప్పగిస్తుంది.

– కృష్ణారావు, సూపరింటెండెంట్, ఎన్టీఆర్ ఆస్పత్రి, అనకాపల్లి

రేపటి నుంచి స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు



యలమంచిలి రూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఎంపికలు(అండర్–19 బాల బాలికలకు) ఈ నెల 11 నుంచి 13 వరకు వయో విభాగాల వారీగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్టు జూనియర్ కళాశాలల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఏ పుష్పలత తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే బాల బాలికలు 2007 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలి. ఓపెన్ స్కూల్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఎంపికలకు అనర్హులు. అర్హులైన విద్యార్థులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రం, విద్యార్థి పెన్ నెంబర్, వారు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్ తమ వెంట తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 94408 85898, 99669 31556, 98854 73808, 99516 76965, 99850 65340 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఎంపికల షెడ్యూల్ ఇలా..

తేదీ	గేమ్	ఎంపిక స్థలం
11/09	ఫెన్సింగ్, ఘట్కా, కరాటే, కురాష్, జూడో	ఎస్వీఎస్ కాలేజ్, పరవాడ
11/09	షూటింగ్, వుషూ	దేశపాత్రునిపాలెం
12/09	ఫుట్‌బాల్, నెట్‌బాల్	సెయింట్ పీటర్స్ స్కూల్, జ్ఞానాపురం,
12/09	బాక్సింగ్	పోర్ట్ స్టేడియం
13/09	ఆర్చరీ, సెపక్ తక్రా, సైక్లింగ్	శ్రీకృష్ణాపురం, సెంట్రల్ జైల్
13/09	సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్	ఏయూ గ్రౌండ్స్
13/09	మల్లఖాంబ్	జీవీకే కళాశాల, విశాలాక్షినగర్

బల్క్‌డ్రగ్ పార్క్ ఉద్యమానికి సహకరించండి

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన మత్స్యకారులు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన లక్ష్మణ్



బల్క్ డ్రగ్ పార్క్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న చిట్టిబాబు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ వల్ల మత్స్యకారుల ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని, ఈ ప్రాంత మంతా కాలుష్య కాసారమవుతుందని మండలంలో రాజయ్యపేట, బోయపాడు గ్రామాలకు చెందిన మత్స్యకారులు కోడ లక్ష్మణ్, పిక్కి చిట్టిబాబు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. మంగళవారం వారు తాడేపల్లిలో పార్టీ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి బల్క్ డ్రగ్‌పార్క్ వల్ల కలిగే నష్టాలను, ఈ ప్రాంత మత్స్యకారులు చేస్తున్న ఆందోళనలు గురించి వివరించారు. స్థానిక మత్స్యకారులు వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా ఏర్పాటు చేస్తోందన్నారు. గత నెలలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మత్స్యకారులు బల్క్‌డ్రగ్‌పార్క్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. సభలో తమ అభిప్రాయాలు చెప్పకుండా పోలీసుల సాయంతో తమను సభ ప్రాంగణంలోకి రాకుండా అడ్డుకున్నారని జగన్‌మోహన్‌రెడ్డికి వివరించడం జరిగిందని, లక్ష్మణ్, చిట్టిబాబు తెలిపారు. కోస్టల్ కారిడార్ పేరుతో కెమికల్ ఫ్యాక్టరీలు, ఫిషింగ్ హార్బర్లు, రిసార్ట్స్, టూరిజం పార్క్‌లు ఏర్పాటు చేసి ఈ ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులను ఖాళీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అలాగే ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపులో ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. మత్స్యకారులు చేస్తున్న ఆందోళనలకు వైఎస్సార్‌సీపీ తరపున సంఘీభావం ప్రకటించి గంగపుత్రుల ప్రాణాలు కాపాడాలని జగన్‌మోహన్ రెడ్డిని కోరడం జరిగిందన్నారు. తమ సమస్యలను పూర్తిగా విన్న జగన్ సానుకూలంగా స్పందించారని, మత్స్యకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు.

క్వారీ బాంబు పేలుళ్ల బాధితులకు భరోసా

రాజన్నపేటలో దెబ్బతిన్న గృహాల పరిశీలన



రాజన్నపేటలో దెబ్బతిన్న గృహాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: మండలంలో రాజన్నపేటలో క్వారీలో బ్లాస్టింగు వల్ల దెబ్బతిన్న గృహాలను, రహదారులను తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ మంగళవారం పరిశీలించారు. రెండు మాసాల క్రితం శరభవరం, రాజన్నపేట సమీపంలో క్వారీలో బాంబు పేలుళ్లు చేపట్టారు. దాంతో రాజన్నపేటలో పలు గృహాలు దెబ్బతిన్నాయి. రోడ్లకు పగుళ్లు ఏర్పడి నష్టం వాటిల్లింది. ఈ సమస్యను బాధితులు మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో రాజన్నపేటలో ఈ నెల 7న బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో అధికారుల తీరుకు నిరసన చేపట్టారు. దెబ్బతిన్న గృహాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8న నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్డీవో వి.వి. రమణ స్పందించి గ్రామానికి వెళ్లి సమస్య తెలుసుకోవాలని తహసీల్దార్ నాగమ్మను ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఆర్ఐ రామ్మూర్తితో రాజన్నపేటలో పరిశీలించారు. ఆర్డీవోకి నివేదికలు అందజేస్తానని గ్రామస్తులకు తెలియజేశారు.

ఉత్సాహంగా 5కె రెడ్ రన్



5కె రెడ్ రన్ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, తదితరులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఇంటర్నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా జిల్లా స్థాయి మారథాన్ 5కె రెడ్ రన్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్ కృష్ణారావు ప్రారంభించారు. పూడిమడక రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ రన్‌లో జిల్లా వైద్య విద్యా అధికారి విభాగం సహకారంతో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా పురుషుల్లో రామానాయుడుకు రూ.10 వేలు, వినోద్‌కు రూ.7 వేలు, స్త్రీలలో వాణికి రూ.10 వేలు, దివ్యకు రూ.7వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కే రామచందర్, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ స్పందన ప్రశాంతి, డీఎండీవో చిరంజీవి, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

మోకాలిలో కిలోన్నర కణితి తొలగింపు

నక్కపల్లి సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స



మోకాలి నుంచి తొలగించిన కణితి



శస్త్రచికిత్స అనంతరం బాధితుడితో వైద్యుడు రవికిరణ్

నక్కపల్లి: స్థానిక 50 పడకల ఏరియా ఆస్పత్రిలో మంగళవారం అరుదైన శస్త్రచికిత్స జరిగింది. మోకాలిలో కిలోన్నర కణితిని ఆర్థోపెడిక్ వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఉద్దండపురం గ్రామానికి చెందిన తుమ్మల రాజారావు విపరీతమైన మోకాలి నొప్పితో బాధపడుతున్నాడు. కాలు బరువుగా ఉండటంతో నడవలేని పరిస్థితి నెలకొంది. ఇతను వైద్యం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్‌ను కలిశాడు. వెంటనే ఎక్స్‌రే తీసి మోకాలిలో కణితి ఉన్నట్లు గుర్తించారు. ఆస్పత్రిలో చేర్చుకుని శస్త్రచికిత్స చేసి దాన్ని తొలగించారు. తొలగించిన కణితి బరువు 1.50 కిలోలు ఉంటుందని డాక్టర్ తెలిపారు. సర్జరీ విజయవంతంగా పూర్తయిందని, రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. బాధితుడు రాజారావు మాట్లాడుతూ ఎంతోకాలం నుంచి మోకాలి నొప్పితో బాధపడుతున్నానని, ప్రైవేటు ఆస్పత్రుల వద్ద నొప్పి కోసం మందులు వాడేవాడినన్నారు. నక్కపల్లిలో ఆర్థోపెడిక్ సర్జన్ ఉన్న విషయం తెలుసుకుని ఇక్కడకు వస్తే ఆపరేషన్ చేశారన్నారు. ఇదే కణితిని ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి తొలగిస్తే వేలాది రూపాయలు ఖర్చవుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. తొలిసారిగా ఇటువంటి కణితిని తొలగించినట్టు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. డాక్టర్ రవికిరణ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష, సహచర వైద్య సిబ్బంది అభినందించారు.

ద్విచక్ర వాహనాలు స్వాధీనం



తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ

నర్సీపట్నం: డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టౌన్ ఇన్‌చార్జి సీఐ ఎల్.రేవతమ్మ, సిబ్బందితో అయ్యన్న కాలనీ, నీలంపేటలలో మంగళవారం కార్డన్ సెర్చ్ చేపట్టారు. డాగ్ స్క్వాడ్, డ్రోన్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణా, నిల్వలను కనిపెట్టేందుకు ఈ సోదాలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. రికార్డులు, నెంబరు ప్లేట్లు లేని 18 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు.

మహా సముద్రాలు సంపదకు నిలయాలు



సముద్ర సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గిడుగు రామదాస్

పాయకరావుపేట: మహా సముద్రాలు సంపదకు నిలయాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ డాక్టరు గిడుగు రామదాస్ తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో సముద్ర సాంకేతిక పరిజ్ఞానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామదాస్ హాజరై మాట్లాడుతూ మహా సముద్రాలను కాపాడుకోవాలన్నారు. సముద్రాల నుంచి వచ్చిన అపరిమితమైన వనరులు, వాటిని పొందేందుకు, అధ్యయనం చేసేందుకు ఉపయోగించే పరికరాలు, వాటి సాంకేతికతను వివరించారు. ఇటీవల సముద్రయాన్ అభియాన్ ద్వారా మత్స్య 6000 అనే జలాంతర్గామిని రూపొందించి మానవులను ఆరు వేల అడుగుల లోతుకు పంపగలిగామన్నారు. ఈ విజయంతో భారతదేశం ప్రపంచంలో ఆరో దేశంగా అవతరించిందన్నారు. ఇది దేశానికి గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రిన్సిపాల్ డాక్టరు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు కొత్త అతిథి 'రియో'



జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో కొత్తగా చేరిన రియో జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో పోలీస్ శాఖకు కొత్త అతిథి వచ్చింది. మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ 6వ బెటాలియన్‌లో 10 నెలల పాటు శిక్షణ పొందిన జాగిలం 'రియో' మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సందడి చేసింది. ఈ జాగిలాన్ని ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించారు. బెల్జియం మలనాయిస్ జాతికి చెందిన ఈ ఆడ జాగిలం ట్రాకింగ్, పేలుడు పదార్థాలను గుర్తించడంలో శిక్షణ పొందినట్లు ఆయన తెలిపారు. కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించే జాగిలాల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 7 జాగిలాలు ఉండగా.. కొత్తగా చేరిన రియోతో వీటికి సంఖ్య మొత్తం ఎనిమిదికి చేరిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్‌డ్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐ బి.రామకృష్ణ, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అడ్డాల ఆదినారాయణ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: పట్టణంలో వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి పట్టణ సీఐ టి. విజయ్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. గవరపాలెంలో నివాసముంటున్న తట్టా మనోజ్ కుమార్(30) ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య మహలక్ష్మి మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై కూటమి దెబ్బ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు



కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవింద్

అనకాపల్లి/తుమ్మపాల: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆటో డ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల పరిస్థితి దినదిన గండంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓలా, ఊబర్, రాపిడో, తదితర ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసి ప్రభుత్వ యాప్‌తో సర్వీసులు చేపట్టాలని కోరారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.25వేలు అందించాలన్నారు. ఇన్సూరెన్స్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అధిక జరిమానాలు విధించే జీవో నంబర్లు 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి వేల్పువీధి జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, రింగ్ రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకూ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ, జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మార్కండేయులు, సహాయ కార్యదర్శి సూరిశెట్టి బాపునాయుడు, నాయకులు కె.నాగరాజు, అంజి, కోరిబిల్లి రామప్పారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

- పట్టణంలో పలు ఆటో యూనియన్ సంఘాలు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.శ్రీనివాసరావు, రుత్తల శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 18న విజయవాడలో తలపెట్టిన ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గణపతి, శంకర్, ఎస్.కె.సుభాని, శ్రీనివాసరావు, కాశీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో కార్మికుల నిరసన

కశింకోట: నూకాంబిక ఆటో స్టాండ్ కార్మికులు మంగళవారం కశింకోటలోని నిరసన తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని వాపోయారు. దీంతో కుటుంబాలు గడవడం కష్టం మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి ఏఐటీయూసీ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సుమారు 70 మంది ఆటో కార్మికులు తరలివెళ్లారు.

3 లారీలపై కేసులు నమోదు

కశింకోట: జాతీయ రహదారిపై ఇతర వాహనాలకు ప్రమాదకరంగా పరిణమించే లోడ్‌తో తరలి వెళుతున్న మూడు లారీలను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వాహన తనిఖీలో భాగంగా రోడ్డుపై పక్క వాహనాలకు ప్రమాదం కలిగించే విధంగా అడ్డదిడ్డంగా ఎక్కువ లోడ్‌తో వెళుతుండగా లారీలను పట్టుకున్నామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిబంధనలు ఉల్లంఘించిన వాటి డ్రైవర్లను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

పెన్షన్ పెంచాలని ఆర్టీసీ పెన్షనర్ల వినతి

అనకాపల్లి టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచాలని సంబంధిత రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు విత్తనాల పోతురాజు కోరారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు రిటైర్డ్ అయిన ఆర్టీసీ కార్మికులకు రూ.వెయ్యి నుంచి రూ.1400, ఆ తర్వాత రిటైర్డ్ అయిన వారికి రూ.2 వేలు పెన్షన్ మాత్రమే ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇది ఏమాత్రం కుటుంబ పోషణకు ఉపయోగపడటం లేదని వాపోయారు. తక్షణమే పెన్షన్‌ను పెంచి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి దాసరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సినీ హీరో బెల్లంకొండ



సింహగిరిపై భక్తులతో సెల్ఫీ దిగుతున్న బెల్లకొండ శ్రీనివాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ నెల12న విడుదలవుతున్న కిష్కింధపురి సినిమా విజయవంతం కావాలని స్వామిని కోరుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింహగిరిపై పలువురు భక్తులు శ్రీనివాస్‌ను కలిసి ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 15 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,630	4,630
రెండో రకం	3,870	3,870
మూడోరకం	-----	----

అనకాపల్లి సినిమాలు

రాజా	మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	ది కన్జూరింగ్ 4 లాస్ట్ రైట్స్
పర్తిసాయి	ఘాటీ
షిర్డీసాయి	కూలీ
వెంకటేశ్వర	లిటిల్ హార్ట్స్
రామచంద్ర	వార్-2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17, బీ పాజిటివ్-23, ఓ పాజిటివ్-34, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 322 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

పశువుల పెంపకం.. ఆరోగ్య సంరక్షణ

- వర్షాకాలంలో జాగ్రత్తలు అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం
- పశువైద్యుల సలహాలు పాటించాలి



ఆవు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

తుమ్మపాల: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పశువుల సంరక్షణ చర్యలు ఎంతో అవసరం.. ముఖ్యంగా పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలి. జీవాలకు వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీప పశు వైద్యశాలను సంప్రదించాలి. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, ఆస్పత్రికి తరలించలేని పరిస్థితిలో ఉన్నా 1962కు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వచ్చి పశు వైద్యులు సేవలు అందిస్తున్నారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలిస్తారు.

నట్టలతో ఎదుగుదలకు బ్రేక్

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు నట్టల వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చిమేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం. నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు (హెచ్ఎస్) టీకాలు వేయించుకోవాలి. వ్యాధి బారిన పడిన పశువును మిగిలిన వాటి నుంచి దూరం చేయాలి.

వ్యాక్సిన్‌తో 'చిటుకు'కు చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రైతులు పశువులకు సంబంధించిన వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే వాటిని వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.

'గాలికుంటు'తో నీరసం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

మండలంలో పశువుల వివరాలు	
ఆవులు	8,848
గేదెలు	14,676
గొర్రెలు	5,000
మేకలు	7,500

పీడించే 'జలగ'

మురుగునీరు, కాలువల్లో అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రె లు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 10 మిల్లీలీటర్ల నియోజడ ప్లస్‌ను అందించాలి.

గొర్రెలు, మేకలకు టీకాలు పూర్తిగా వేశాం

పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే అలస్యం చేయకుండా సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. వ్యాధి నివారణ టీకాలు వేయిస్తే వాటి ప్రభావం ఆరు నెలల వరకూ ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆర్నెల్లకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించవచ్చు.

– అనిల్, పశుసంవర్ధక శాఖ అధికారి, అనకాపల్లి మండలం

కూటమి ప్రభుత్వం నిర్బంధకాండ

వైఎస్సార్‌సీపీ నేతల గృహ నిర్బంధం



కన్నూరుపాలెంలో గృహ నిర్బంధంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు



గోపాలపురంలో ఎంపీపీ గొర్లి సూరిబాబును హౌస్ అరెస్టు చేసిన రూరల్ పోలీస్‌లు



ఏఎస్ పేటలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్



కశింకోటలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

అనకాపల్లి/ కశింకోట: ఎరువుల సమస్యపై అన్నదాత పోరుకు సిద్ధమవుతున్న వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం నిర్బంధకాండ ప్రదర్శించింది. రాష్ట్రంలో రైతులకు యూరియా సరఫరా చేయడంలో విఫలమైన ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రైతులకు మద్దతుగా అనకాపల్లిలో తలపెట్టిన కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబును మంగళవారం ఉదయం మండలంలో గోపాలపురంలో ఆయన స్వగృహంలో రూరల్ పోలీస్‌లు నిర్బంధించారు. కశింకోట మండలంలో వేకువ జామున 4 గంటల ప్రాంతంలో పోలీసులు కన్నూరుపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఏఎస్ పేటలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, కశింకోటలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి మళ్ల బుల్లిబాబుల ఇళ్లకు వెళ్లి వారిని గృహ నిర్బంధం చేశారు. మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో నిర్బంధం నుంచి విడిచిపెట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల సమస్యపై రైతుల పక్షాన నిలబడి నిరసన తెలియజేయడానికి వెళ్లనీయకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం శోచనీయమన్నారు. యూరియా కోసం గంటల తరబడి ప్రైవేటు దుకాణాలు, రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. నల్ల బజారులో అధిక ధర చెల్లిస్తే తప్ప యూరియా లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు అవసరం మేరకు కనీసం యూరియాను అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కృత్రిమ కొరతను సృష్టించి యూరియాను బ్లాక్ మార్కెట్ దందాకు కూటమి నేతలు పాల్పడుతూ రూ.కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత లేకుండా ప్రభుత్వం అందించి ఉంటే తాము నిరసన తెలపాల్సిన అవసరం ఏర్పడేది కాదన్నారు. అయితే నాయకులను నిర్బంధించి అడ్డంకులు కల్పించినా వెరవకుండా పోలీసులకు కానకుండా మండల గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు, రైతులు అనకాపల్లిలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు

సబ్బవరం: ఈ నెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో వైద్య సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే మండలంలో 16,250 డోస్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. కోళ్లకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.150కే లింగ నిర్ధారణ వీర్యం గురించి పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి కిసాన్ క్రెడిట్ లోన్స్ కోసం కనీసం 5 దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. సమీక్షలో స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ వి.చిట్టినాయుడు, పశు వైద్యాధికారులు డా.స్వర్ణలత, డా.అరుణ, డా.సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉద్యమ్ ఆధార్ నమోదు తప్పనిసరి'



మాట్లాడుతున్న పరిశ్రమల ప్రోత్సాహక అధికారి త్రివేణి

సబ్బవరం: వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలతో పాటు సేవారంగ కార్యక్రమాలు నిర్వహించే సభ్యులు ఉద్యమ్ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని పరిశ్రమల ప్రోత్సాహక అధికారి ఎస్.త్రివేణి తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ్ ఆధార్ నమోదుపై మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి రుణాలు, ఇతర ప్రోత్సాహకాల కోసం ప్రతి వ్యాపార, సేవా, ఉత్పత్తి రంగాల్లో ఉన్నవారికి ఉద్యమ్ ఆధార్ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో 54 మంది సభ్యులకు ఉద్యమ్ నమోదు చేయించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మృతదేహం అప్పగింత

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామ ప్రాంతానికి చేరిన బుద్ద కీర్తి కుమారి మృతదేహాన్ని మంగళవారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగు రోజుల క్రితం మునగపాక మండలం ఉమ్మలాడ వద్ద జాతీయ రహదారి వంతెనపై నుంచి శారదా నదిలో దూకి కీర్తి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహం ప్రవాహ వేగానికి దిగువన ఉన్న మండలంలోని వెదురుపర్తి వద్దకు కొట్టుకువచ్చి చెట్టుకు చిక్కుకోవడంతో ఆచూకీ కనుగొన్న సంగతి తెలిసిందే. దాన్ని పోలీసుల సహాయంతో వెలికితీసి అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. ఇక్కడ మృతదేహం లభ్యం కావడం వల్ల కేసు నమోదు చేసి, ఆ మండల పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జి.రమేష్‌బాబు

పాయకరావుపేట: దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్షణ నుంచి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జి.రమేష్‌బాబు కోరారు. నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు గుర్తింపు శిబిరం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మంగళవారం జరిగింది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల నుంచి 200 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వారిని పరీక్షించి, బోధనోపకరణ, సామగ్రి కిట్టు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్లు అవసరమని గుర్తించినట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ జిల్లా సహిత సమన్వయకర్త బి.రామకృష్ణ, ఆల్మికో సంస్థ వైద్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక్కడి వడ్డి వీధిలో విద్యుత్ లైన్‌లో బ్లేడులు మార్చడం వల్ల సరఫరాకు అంతరాయం కలిగిందని సిబ్బంది తెలిపారు. మరమ్మతులు అనంతరం సరఫరాను పునరుద్ధరించామన్నారు.

ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి

మాకవరపాలెం : ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆన్‌రాక్ భూ నిర్వాసితులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని రాచపల్లి రెవెన్యూ పరిధిలో 2007లో ఆన్‌రాక్ రిఫైనరీ నిర్మాణం కోసం జరిగిన భూ సేకరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. అయితే వెంకయ్యపాలెం, చినరాచపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో సుమారు 30 మందికి పైగా నిర్వాసితుల జిరాయితీ భూముల్లో ఏర్పాటు చేసుకున్న నివాసాలు కోల్పోయినా ఇప్పటికీ స్థలాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టర్‌కు విన్నవించామని భూ నిర్వాసితులు చింతల వరహాలమ్మ, సుర్ల అప్పనాయుడు, కన్నాలమ్మ తెలిపారు. అధికారులు విచారణ చేసి తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయునికి పురస్కారం



రాంబాబును సత్కరిస్తున్న గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఫిజికల్ సైన్స్ టీజీటీ డాక్టర్ టి.రాంబాబుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కింది. విజయవాడలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ చేతులమీదగా మంగళవారం ఆయన్ని సత్కరించి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ సిబ్బందితో కలిసి అభినందనలు తెలిపారు.

క్వారీ అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు

అనకాపల్లి టౌన్: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపాలెంలో క్వారీ నిర్వహణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ సభ మంగళవారం జరిగింది. కోటపాటి ప్రియదర్శిని పేరుతో సర్వే నెంబర్ 109లో నాలుగు హెక్టార్లు, లక్ష్మీనరసింహ మెటల్స్ అండ్ సాండ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో సర్వే నెంబర్‌లో 6.18 హెక్టార్లలో క్వారీ నిర్వహణకు గ్రామస్తులు ఆమోదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పర్యావరణ పరిరక్షణ సంఘాల నాయకులు మాట్లాడుతూ క్వారీ నిర్వహణతో ఇక్కడ వారికి ఉపాధి లభిస్తుందన్నారు. గ్రామసభలో క్వారీ యజమానులు చెప్పే విధంగా మొక్కలను విరివిగా నాటి క్వారీ నిర్వహించుకోవాలని కోరారు. క్వారీ యజమానులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీపీఎం నాయకుడు రాజాన దొరబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

వరిలో పొడ తెగులు ఆశించే అవకాశం



శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల్లో వరిలో పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున, నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమావేశం జరిగింది. పలు అంశాలపై ఆయన మాట్లాడారు. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వరిలో కాండం తొలుచు, ఆకుముడత పురుగులు ఆశించవచ్చు. నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరాకు 8 కిలోల చొప్పున పొలంలో చల్లుకోవాలి. దుబ్బుచేసే దశలో ఉన్నవరి పైరుకు, రాగల వర్షాలను ఉపయోగించుకుని 25 కిలోల యూరియాను బురద పదునులో సమానంగా వెదజల్లాలి. 30 రోజుల వెద వరిలో గడ్డి జాతికలుపు సమస్య ఎక్కువగా ఉన్నట్లయితే ఫెనాక్సాప్రాప్-ఇథైల్‌ను ఎకరాకు 250 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రాగి పైరులో అగ్గితెగులు నివారణకు కార్బెండజిమ్ 1గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. చెరకు పైరులో మొవ్వుకుళ్లు తెగులు నివారణకు కార్బెండజిం 1 గ్రా. లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షాధారపు చెరకు తోటలో కలుపు ఎక్కువగా ఉన్నట్లయితే మెట్రిబుజిన్ 400 గ్రా. 2, 4-డి 800 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తీగజాతి కలుపు మొక్కల సమస్య ఎక్కువగా ఉన్నట్లయితే, క్లోరిమ్యురాన్ ఇథైల్ మెట్ సల్ఫ్యురాన్ మిథైల్ కలుపు మందును ఎకరానికి 8 గ్రా.ల చొప్పున 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కూరగాయలలో వడలు తెగులు ఆశించే అవకాశం ఉందని కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, ఆర్.సరిత, సీహెచ్.రామలక్ష్మి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు వాహన మిత్ర ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

నర్సీపట్నం: వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఆటో కార్మికులకు రూ.25 వేలు వాహన మిత్ర ప్రకటించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ ఆటో యూనియన్ కార్మికులు సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఫ్రీ బస్సు పథకంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. నేటికి కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించలేదన్నారు. ఆటో కార్మికులకు తక్షణమే వాహన మిత్ర కింద రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు.

కె.కోటపాడు : స్త్రీశక్తి పథకం ద్వారా ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని కె.కోటపాడు ఆటో యూనియన్ నాయకుడు అంజూరు దేముడు బాబు అన్నారు. మంగళవారం కె.కోటపాడు మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు.

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలంటూ మంగళవారం వడ్డాదిలో ధర్నాకు దిగారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడించి ఉద్యమం తీవ్రం చేస్తామన్నారు.